సాక్షి
పశ్చిమగోదావరి
శుక్రవారం । 1 । ఆగస్టు । 2025



ఆక్వా దుకాణాలకు రెక్కలు

కైకలూరులోని ఆక్వా ల్యాబ్ అలంకార ప్రాయంగా మారింది. ల్యాబ్‌లో పరికరాలు ఉన్నా సేవలు అందడం లేదు.

8లో



సేంద్రియ సాగుతో ఖర్చు ఆదా

రైతులు రసాయన ఎరువులకు బదులుగా సేంద్రియ ఎరువులను వాడాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

8లో



లారీని ఢీకొట్టిన వ్యాన్

ఆగి ఉన్న ట్రాలీ లారీని వెనుక నుంచి వ్యాన్ ఢీకొన్న ప్రమాదంలో వ్యాన్ క్లీనర్ అక్కడి కక్కడే మృతి చెందాడు.

8లో

న్యూస్‌రీల్

మద్యం మత్తులో ఏటీఎం ధ్వంసం



ధ్వంసమైన ఎస్‌బీఐ ఏటీఎం

ఆకివీడు: స్థానిక గుమ్ములూరు సెంటర్‌లో పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలోని ఎస్‌బీఐ ఏటీఎంను మద్యం మత్తులో ఓ వ్యక్తి ధ్వంసం చేశాడు. బుధవారం మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో తాగిన మైకంలో ఏటీఎం గది అద్దాలను గుద్దుకుంటూ లోనికి వెళ్లాడు. గురువారం ఉదయం ఏటీఎం నగదు డ్రా చేసే కింది భాగంలో డోర్ తెరిచి ఉంది. దీంతో రూరల్ సీఐ జగదీశ్వరరావు సంఘటనా స్థలాన్ని, సీసీ పుటేజీలను పరిశీలించారు. ఏటీఎంలో డబ్బు భద్రంగా ఉందని తెలిపారు.

క్లోరినేషన్ చేసి నీరు సరఫరా

సాక్షి స్పందన

ఆకివీడు: మండలంలోని అప్పారావుపేట గ్రామంలో క్లోరినేషన్ చేసి తాగు నీటిని కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్నామని గ్రామ కార్యదర్శి బి.సతీష్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 'సమస్యల వలయంలో అప్పారావుపేట' శీర్షికన 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి ఆయన స్పందించారు. ప్రతినెలా రక్షిత మంచినీటి పథకాన్ని శుభ్రం చేయిస్తున్నామన్నారు. అప్పారావుపేట-గుమ్ములూరు రోడ్డుకు నాబార్డు (ఆర్ఐడీఎఫ్) నిధులు మంజూరు అయ్యాయని పనులు జరగాల్సి ఉందన్నారు. 2.50 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి రూ.1.60 కోట్లు విడుదలయ్యాయని చెప్పారు. ఉపాధి హామీ నిధులతో డ్రెయిన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామని తెలిపారు.

జూనియర్ కాలేజీల్లో ప్రవేశాల గడువు పెంపు

భీమవరం: ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు ఈనెల 11 వరకు గడువు పొడిగించినట్టు జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖ అధికారి జి.ప్రభాకరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో గతేడాది 1,410 మంది చేరగా ఈ ఏడాదిలో 1,618 మంది ప్రవేశాలు పొందారన్నారు. ప్రభుత్వం ఇంటర్మీడియెట్ విద్యార్థులకు తల్లికి వందనం, టెస్ట్, నోట్‌బుక్స్, మధ్యాహ్నం భోజన పథకంతోపాటు విద్యార్థులకు పోషకాహారం కోసం చిక్కీలు, రాగి జావ అందిస్తున్నట్టు చెప్పారు.

ఉపాధ్యాయులకు అన్యాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యారంగంలో ప్రభుత్వం తీసుకుంటున్న అసంబద్ధ నిర్ణయాలతో జిల్లా పరిషత్, మండల పరిషత్ ఉపాధ్యాయులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఏపీటీఎఫ్ 1938 రాష్ట్ర అకడమిక్ కమిటీ కన్వీనర్ గుగులోతు కృష్ణ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చేరిన ఉపాధ్యాయులకు మాత్రమే ఎంఈఓ, డీవైఈఓలుగా బాధ్యతలు అప్పగిస్తామని అధికారులు ఎలా నిర్ధారిస్తారని ప్రశ్నించారు. జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపల్ యాజమాన్యాల్లో పనిచేసే ఉపాధ్యాయులపై ప్రభుత్వ ఉపాధ్యాయుల పెత్తనం ఏంటని ప్రశ్నించారు. ఉమ్మడి సర్వీసు రూల్స్‌కు సంబంధించి 72, 73, 74 జీఓల అమలులో పక్షపాత వైఖరి సరికాదన్నారు. వెంటనే ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను ఉపసంహరించుకుని ఉమ్మడి సీనియార్టీ ద్వారా మాత్రమే ఎంఈఓ-1 పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

రిజిస్ట్రేషన్ ఆదాయంలో ఫస్ట్

నూజివీడు: ఏలూరు జిల్లాలోని 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ద్వారా రూ.548.80 కోట్ల రెవెన్యూతో రాష్ట్రంలోనే అత్యధిక ఆదాయాన్ని సాధించినట్టు ఏలూరు జిల్లా రిజిస్ట్రార్ కొమ్మినేని శ్రీనివాసరావు తెలిపారు. గురువారం నూజివీడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే నూజివీడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం 80 శాతం వృద్ధి సాధించిందన్నారు. రిజిస్ట్రేషన్ విధానంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణల్లో భాగంగా కార్డ్ ప్రైమ్ 2.0 విధానంలో రిజిస్ట్రేషన్ జరిగిన రోజే డాక్యుమెంట్‌ను యజమానికి అందిస్తున్నామన్నారు. ఆగస్టు 1 నుంచి రిజిస్టర్ డాక్యుమెంట్ కాపీని యజమానికి వాట్సాప్ ద్వారా అందిస్తామన్నారు. ఏలూరు కార్పొరేషన్ పరిధిలో కార్డ్ ప్రైమ్ 2.0ను మున్సిపల్ పరిపాలన విభాగంతో అనుసంధానం చేసి, అర్బన్ పరిధిలో ఉన్న ఆస్తులను మ్యూటేషన్ చేసి యజమాని మార్పిడి జరుగుతుందన్నారు. ఏలూరు, వట్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రారంభిస్తామన్నారు.

అంగన్‌వాడీ.. సమస్యల ఒడి

ఆట బొమ్మలకూ దిక్కులేదు

- అంగన్‌వాడీ కేంద్రాలకు ఆట పరికరాలు సరఫరా చేయని కూటమి సర్కారు
- పాడైపోయిన వాటితోనే పిల్లలకు ఆటలు
- సన్నబియ్యం రాక చౌక బియ్యమే పంపిణీ
- జిల్లాలో 1,626 అంగన్‌వాడీ కేంద్రాలు
- ఐదేళ్లలోపు చిన్నారులు 58,393
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అంగన్‌వాడీలకు పెద్దపీట



పెనుమంట్రలోని ఓ అంగన్‌వాడీ కేంద్రంలో విరిగిపోయిన బొమ్మలతో ఆడుకుంటున్న చిన్నారులు

సాక్షి, భీమవరం: ఆటపాటలతో చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పే అంగన్‌వాడీ కేంద్రాలు కూటమి సర్కారు నిర్లక్ష్యం నీడలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఆట పరికరాల సరఫరా లేక పిల్లలు పాడైపోయిన బొమ్మలతోనే ఆడుకోవాల్సిన దుస్థితి. సన్నబియ్యం రాక ముతక బియ్యాన్ని పంపిణీ చేయాల్సి వస్తోందని అంగన్‌వాడీ వర్కర్లు చెబుతున్నారు.

1,556 కేంద్రాలు.. 70 మినీ కేంద్రాలు

జిల్లాలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మొత్తం 1,626 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో ఆయాలతో నడిచే మినీ కేంద్రాలు 70 ఉండగా, వర్కర్, ఆయాలతో నిర్వహించే కేంద్రాలు 1,556 ఉన్నాయి. వీటి పరిధిలో 7,936 మంది గర్భిణులు, 5,686 మంది బాలింతలు, ఏడు నెలల వయసు నుంచి మూడేళ్ల లోపు చిన్నారులు 40,706 మంది, మూడేళ్ల నుంచి ఐదేళ్లలోపు బాలలు 17,687 మంది ఉన్నారు.

ముతక బియ్యమే సరఫరా

గర్భిణులు, బాలింతలకు నెలకు మూడు కిలోల చొప్పున బియ్యం, కిలో కందిపప్పు, అర లీటరు ఆయిల్ ప్యాకెట్, ఐదు లీటర్ల పాలు, 25 గుడ్లు, కిలో అటుకులు, రెండు కిలో రాగి పిండి, పావు కిలో డ్రైఫ్రూట్స్ తదితర వాటిని అందజేయాలి. గర్భిణులు, బాలింతలకు పోర్టిఫైడ్ బియ్యం సరఫరాను గత వైఎస్సార్‌సీపీప్రభుత్వంలోనే ప్రారంభించారు. అలాగే చిన్నారులకు సోమవారం నుంచి శనివారం వరకు రోజూ అంగన్‌వాడీ కేంద్రాల వద్దనే ఆహారాన్ని అందించాలి. మెనూ ప్రకారం సోమ, బుధ, గురు, శుక్రవారాల్లో అన్నం, కూరలతో భోజనం, మంగళవారం పులిహోరా, శనివారం వెజిటబుల్ రైస్ వడ్డించాలి. హాస్టళ్లు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి సన్నబియ్యం పంపిణీ ప్రారంభించినట్టు చెబుతున్న కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు మాత్రం రేషన్ డిపోల్లో అందజేసే బియ్యాన్నే సరఫరా చేస్తుండటం గమనార్హం. అంగన్‌వాడీ కేంద్రాలకు సన్నబియ్యం సరఫరా చేస్తున్నట్టు సివిల్ సప్లయీస్ అధికారులు చెబుతుండగా తమకు రేషన్ బియ్యమే వస్తున్నాయని వర్కర్లు చెబుతున్నారు. చిన్నారులకు ఆటపరికరాలతో పాటు సన్న బియ్యం సరఫరాకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



ఇరగవరంలోని ఓ అంగన్‌వాడీ సెంటర్‌కు సరఫరా చేసిన రేషన్ బియ్యం

గత ప్రభుత్వ హయాంలో..

అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్దపీట వేసింది. నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా కేంద్రాల్లో వసతుల కల్పన, నూతన భవనాల నిర్మాణం, ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్లు తదితర వసతులు కల్పించింది. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యమిస్తూ పౌష్టికాహారం మెనూలోనూ మార్పులు చేసింది. చిన్నారుల వికాసానికి క్రమం తప్పకుండా ఆటపరికరాలు సరఫరా చేస్తూ వచ్చింది.

పాడైపోయిన బొమ్మలే దిక్కు



చిన్నారుల శారీరక, మానసిక, సామాజిక వికాసానికి, చదువుపై ఆసక్తి పెంపొందించేందుకు ఆటపరికరాలు దోహదపడతాయి. వారు ఆరోగ్యంగా ఎదగేందుకు సాయపడతాయి. పిల్లల ఊహాశక్తిని, సృజనాత్మకతను పెంచే బొమ్మలు, ఆట వస్తువులు, రంగురంగుల బ్లాక్లు, పజిల్స్, లెక్కలు నేర్చుకునేందుకు సంబంధించిన వస్తువులు, పిల్లలు కలిసి ఆడుకోవడానికి, ఒకరితో ఒకరు కలిసిమెలిసి ఉండటానికి ఉపయోగపడే ఆట వస్తువులు తదితర వాటితో కూడిన ఆట పరికరాల కిట్లను ప్రభుత్వం సరఫరా చేసేది. గతంలో రెగ్యులర్‌గా వచ్చేవని రెండేళ్లుగా ఆట పరికరాల కిట్లు సరఫరా నిలిచిపోయినట్టు అంగన్‌వాడీ వర్కర్లు చెబుతున్నారు. కొత్తవి రాక పోవడంతో గత ప్రభుత్వంలో అందజేసిన ప్లాస్టిక్ బొమ్మలు, పరికరాలతోనే ప్రస్తుతం చిన్నారులు ఆడుకుంటున్నారు. వీటిలో చాలా వరకు పాడైపోయి విరిగిపోయాయి. కొన్ని సెంటర్లలో ఈ బొమ్మలు సైతం లేని పరిస్థితి ఉంది. కాగా ఆట పరికరాల కోసం ప్రతిపాదనలు పంపామని, కిట్లు రావాల్సి ఉందని ఐసీడీఎస్ అధికారులు చెబుతున్నారు.

2న ఉపాధ్యాయుల ధర్నా



సంఘీభావం ప్రకటిస్తున్న ఉపాధ్యాయులు

భీమవరం: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం శనివారం భీమవరంలో కలెక్టరేట్ వద్ద ఫ్యాప్టో ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాను జయప్రదం చేయాలని ఫ్యాప్టో చైర్మన్ పెన్మెత్స విజయరామరాజు, జనరల్ సెక్రటరీ జి.ప్రకాశం పిలుపునిచ్చారు. గురువారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన ధర్నా సన్నాహక సమావేశంలో మాట్లాడారు. 12వ పీఆర్సీ, మధ్యంతర భృతి, కారుణ్య నియామకాలు, సీపీఎస్ రద్దు, యాప్స్ భారం తగ్గించాలని, ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని, పెండింగ్ బకాయిలతో పాటు పలు సమస్యలను పరిష్కరించాలనిఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య జిల్లా యూనిట్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు చెప్పారు. ధర్నాలో జిల్లాలోని ఉపాధ్యాయులంతా పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఫ్యాప్టో కో-చైర్మన్ పెన్మెత్స ఆర్‌వీఎస్ సాయివర్మ, డిప్యూటీ జనరల్ సెక్రటరీ రమణారావు, కో-చైర్మన్ శ్రీనివాస్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పీ4పై సమీక్ష

భీమవరం (ప్రకాశంచౌక్) : పీ4 కార్యక్రమంలో మార్గదర్శకులు స్వచ్ఛందంగా పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ కలెక్టర్లకు సూచించారు. గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన సమీక్షించగా భీమవరం కలెక్టరేట్ నుంచి ఇన్‌చార్జి కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, జిల్లా అధికారులు హాజరయ్యారు.

విద్యుత్ సంస్థలో పదోన్నతులు

Eastern power

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏపీఈపీడీసీఎల్ ఏలూరు ఆపరేషన్ సర్కిల్ పరిధిలోని పలువురు సీనియర్ అసిస్టెంట్లకు జూనియర్ అక్కౌంట్స్ అధికారులుగా పదోన్నతులు కల్పిస్తూ ఎస్ఈ పి.సాల్మన్ రాజు ఉత్తర్వులు జారీ చేశారు. పాలకొల్లు ఈఆర్‌ఓలోని ఎల్‌బీవీ సాంబశివరావును భీమవరానికి పదోన్నతిపై బదిలీ చేశారు. ఏలూరు సర్కిల్ కార్యాలయంలోని వై.శ్రీనివాసరావును ఏలూరు సర్కిల్ కార్యాలయంలో ఎల్‌టీ విభాగానికి బదిలీ చేశారు. భీమవరం ఈఆర్‌ఓలోని పీఆర్‌కేవీ ప్రసాద్‌ను నరసాపురం డివిజన్ అక్కౌంట్స్ కార్యాలయానికి బదిలీ చేశారు. ఏలూరు కన్‌స్ట్రక్షన్స్ విభాగంలోని వి.రాజశేఖర్‌ను ఏలూరు సర్కిల్ కార్యాలయంలోని సీపీఎస్ విభాగానికి బదిలీ చేశారు. తణుకు డీ1లోని కె.రవీంద్రనాథ్‌ను తాడేపల్లిగూడెం అక్కౌంట్స్ డివిజన్ కార్యాలయానికి, భీమవరం డివిజన్ కార్యాలయంలోని జి.రామకృష్ణరాజును భీమవరం సర్కిల్ కార్యాలయానికి బదిలీ చేశారు. ఏలూరు సర్కిల్ కార్యాలయంలోని కేవీఆర్‌జీ కృష్ణమూర్తిని అదే కార్యాలయానికి, నరసాపురం డివిజన్ కార్యాలయంలోని ఎస్‌డీ ఆశీర్వాదంను అదే కార్యాలయంలో ఏడీఎం విభాగానికి, ఏలూరు ఈఆర్‌ఓలోని ఎస్.వెంకటేశ్వరరావును ఏలూరు డివిజన్ కార్యాలయానికి, పెరవలి సెక్షన్ కార్యాలయంలోని ఎ.శ్రీనివాసరావును జంగారెడ్డిగూడెం అక్కౌంట్స్ కార్యాలయానికి బదిలీ చేశారు. నిడదవోలు ఈఆర్‌ఓలోని ఎండీ అబ్దుల్ అలీంను నిడదవోలు డివిజన్ కార్యాలయానికి, ఉండ్రాజవరం సెక్షన్ కార్యాలయంలోని కేవీపీ విజయకుమార్‌ను జంగారెడ్డిగూడెం ఈఆర్‌ఓకు, తంగెళ్లమూడి ఈఆర్‌ఓలోని కె.పద్మజను అదే కార్యాలయానికి జూనియర్ అక్కౌంట్స్ అధికారిగా పదోన్నతి కల్పించారు. అలాగే తణుకు ఈఆర్‌ఓలోని కె.బాలకృష్ణకు జూనియర్ అక్కౌంట్స్ అధికారిగా పదోన్నతి కల్పిస్తూ తాడేపల్లిగూడెం డివిజన్ కార్యాలయంలో పోస్టింగ్ ఇచ్చారు. అయితే పరిపాలనా సౌలభ్యం కోసం ఆయన్ను భీమవరం ఈఆర్‌ఓకు బదిలీ చేశారు.

నారాయణ విద్యాసంస్థలకు మంత్రి లోకేష్ అండ

ఎస్‌ఎఫ్‌ఐ నాయకుల విమర్శ

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : నారాయణ విద్యాసంస్థలకు మంత్రి నారా లోకేష్ అండగా నిలబడి అక్రమ విద్యా వ్యాపారానికి వంత పాడుతున్నారని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ విమర్శించారు. గురువారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నగరంలోని మోర్ మార్కెట్ వీధిలోని నారాయణ జూనియర్ కళాశాలలో అనుమతి లేకుండా హైస్కూల్ నడుపుతున్న విషయంపై ఆందోళన నిర్వహించారు. లెనిన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనలో నారాయణ విద్యాసంస్థలు అడ్డగోలుగా వ్యవహరిస్తున్నాయన్నారు. నారాయణ జూనియర్ కళాశాలలో హైస్కూల్ విద్యావ్యవస్థ నడుస్తుందని, అయినా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇది సరికాదని జిల్లాలోని చైతన్య, నారాయణ కార్పొరేట్ విద్యాసంస్థలను అధికారులు పరిశీలించాలని డిమాండ్ చేశారు.

కూటమి మోసాలను ఎండగడదాం

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి



కొత్తపూసలమర్రులో బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు

భీమవరం అర్బన్: ఎన్నికల సమయంలో ఎడాపెడా హామీలిచ్చి తీరా గద్దెనెక్కిన తర్వాత మొహం చాటేస్తున్న చంద్రబాబు వంచన పాలనను తిప్పికొడదామని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని కొత్తపూసలమర్రులో పార్టీ మండల అధ్యక్షుడు జల్లా కొండయ్య అధ్యక్షతన బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రసాదరాజు మాట్లాడుతూ చంద్రబాబుకు ఓటేసిన ప్రతిసారీ ప్రజలు శిక్ష అనుభవిస్తున్నారని, సూపర్‌సిక్స్ అంటూ మరోసారి బాబు మోసం చేశాడని మండిపడ్డారు. సంపద సృష్టిస్తానని చెప్పి ఏడాది పాలనలో రూ.1.60 లక్షల కోట్లు అప్పులు చేశారని విమర్శించారు. అలాగే రాష్ట్రంలో వలంటీర్లు, ఎండీఎం డ్రైవర్లు, మద్యం షాపుల్లో సిబ్బంది ఇలా సుమారు 3 లక్షల మంది ఉద్యోగాలు పీకేశారన్నారు. నిరుద్యోగ భృతి నెలకు రూ.3 వేలు ఇస్తామని మోసం చేశారన్నారు. అలాగే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత 8.58 లక్షల పింఛన్లను రద్దు చేసిందని ధ్వజమెత్తారు. ఉచిత బస్సు, ఆడబిడ్డ నిధి, రైతులకు అన్నదాత సుఖీభవ పథకాలు అమలు చేయలేదన్నారు. పేదలకు ఆరోగ్యశ్రీ అందకుండా రూ.4,500 కోట్ల బకాయిలు పెట్టారన్నారు.

ఇంటింటా నిలదీత

నరసాపురం పార్లమెంటరీ పరిశీలకులు ముదునూరి మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చంద్రబాబు, పవన్‌లు సంతకాలు పెట్టి బాండ్ పేపర్లు ఇచ్చారని, వీటిపై కూటమి నాయకులను ప్రజలు ప్రశ్నిస్తున్నారన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా పార్టీ శ్రేణులంతా సిద్ధంగా ఉండాలని, జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రి చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

కూటమి ప్రభుత్వంలో వందల కోట్లు వృథా

ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులకు ధాన్యం సొమ్ములు జమచేయకుండా చంద్రబాబు ప్రభుత్వం ఇబ్బంది పెట్టిందన్నారు. యోగాంధ్ర, పేరెంట్స్ కమిటీ సమావేశాల పేరుతో వందల కోట్లు ఖర్చు పెట్టారని దుయ్యబట్టారు. భీమవరం నియోజకవర్గ సమన్వయకర్త చినమిల్లి వెంకట్రాయుడు మాట్లాడుతూ గ్రామస్థాయి వరకూ పార్టీని పటిష్టం చేస్తున్నారని, పార్టీలో కష్టపడే వారికి సముచిత స్థానం లభిస్తుందన్నారు. చంద్రబాబు మోసపూరిత పాలనను ఇంటింటా వివరించాలన్నారు. మాజీ సీఎం జగన్ పర్యటనలతో కూటమి నాయకులు ఉలిక్కి పడుతున్నారని, అడుగడుగునా ఆంక్షలు విధిస్తున్నారన్నారు. ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు, జెడ్పీటీసీ కాండ్రేగుల నరసింహరావు, జిల్లా సోషల్ మీడియా విభాగ అధ్యక్షుడు బందన పూర్ణచంద్రరావు, జిల్లా మహిళా విభాగ అధ్యక్షురాలు కోడే విజయలక్ష్మి, జిల్లా యూత్ విభాగ అధ్యక్షుడు చిగురుపాటి సందీప్, నాయకులు మేడిది జాన్సన్, ఏఎస్ రాజు, కామన నాగేశ్వరరావు, పట్టణ కన్వీనర్ గాదిరాజు రామరాజు, ఎంపీటీసీ తిరుమాని తులసీరావు, వైస్ ఎంపీపీ తిరుమాని ధనంజయరాజు తదితరులు పాల్గొన్నారు.

గీత రాత మారేనా?

కూటమి మొండిచేయి

- గీత కార్మికులకు ఇచ్చిన హామీల అమలెప్పుడు?
- ఏడాది దాటినా పట్టించుకోని కూటమి సర్కారు
- వాడవాడలా బెల్టు షాపులు
- ఉమ్మడి జిల్లాలో కల్లుగీత ఛిన్నాభిన్నం
- సుమారు 25 వేల మంది కార్మికులకు కష్టం

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో కల్లు గీత కార్మికులు తమ రాత మారేనా.. కష్టాలు తీరేనా అని ఎదురుచూస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తమ జీవితాల్లో వెలుగులు నింపితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం వేదనను మిగులుస్తోందని ఆందోళన చెందుతున్నారు. ఊరూవాడా బెల్టు షాపులు, విచ్చలవిడిగా మద్యం అమ్మకాలతో గీత వృత్తి మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని అంటున్నారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో సుమారు 9 వేల బెల్టుషాపులు ఉన్నాయని గీత కార్మిక సంఘాల నాయకులు చెబుతున్నారు. గత ఎన్నికల సమయంలో హామీలు గుప్పించిన కూటమి నాయకులు గద్దెనెక్కిన తర్వాత తమను పట్టించుకోవడం లేదని అంటున్నారు. కల్లుగీత వృత్తిపై ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సుమారు 25 వేల మంది కార్మికులు ఆధారపడి ఉన్నారంటున్నారు.

9 వేలకు పైగా బెల్టు షాపులు

ఏలూరు జిల్లావ్యాప్తంగా సుమారు 5 వేలు, పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా సుమారు 4 వేలు బెల్టు షాపులు ఉన్నాయి. కూటమి నాయకులు, వారి అనుచరులే బెల్టుషాపులను నిర్వహిస్తున్నారని, దీంతో గీత వృత్తి కనుమరుగయ్యే ప్రమాదం ఉందని గీత కార్మికులు ఆవేదన చెందుతున్నారు. బెల్టు షాపులపై కొరడా ఝుళిపిస్తామని ముఖ్యమంత్రి, ఎక్సైజ్ మంత్రి ప్రకటనలు చేయడం తప్ప ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో తమ సమస్యల పరిష్కారం కోసం గీత కార్మికులు ఆందోళన బాట పట్టారు. ఇప్పటికే సర్కిల్ వారీగా సభలు, సమావేశాలు నిర్వహించిన కార్మికులు ఆందోళనను ఉధృతం చేసే దిశగా అడుగులు వేస్తున్నారు. ఈనెల 18న ఏలూరు కలెక్టరేట్ వద్ద భారీ ఆందోళనకు సిద్ధమవుతున్నారు.



కల్తీ మద్యం హల్‌చల్!

ఉమ్మడి జిల్లాలో కల్తీ మద్యం హల్‌చల్ చేస్తున్నట్లు గీత కార్మిక సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. గోవా, యానాం నుంచి అక్రమ మద్యం తీసుకు వస్తున్నారని చెబుతున్నారు. అనకాపల్లి, పరవాడ కేంద్రంగా కబళిస్తున్న కల్తీ మద్యం రాకెట్ పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లును స్థావరంగా చేసుకుందని అంటున్నారు. పాలకొల్లులో కల్తీ మద్యం తయారుచేసి తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కాకినాడ జిల్లాలకు సరఫరా చేస్తున్నట్టు వార్తలు వస్తున్నా అధికారులు స్పందించడం లేదని ఆరోపిస్తున్నారు. బెల్టు షాపుల్లో అధికంగా కల్తీ మద్యం విక్రయిస్తున్నారని, హైదరాబాద్ నుంచి స్పిరిట్‌ను తీసుకువచ్చి రంగు నీళ్లు కలిపి మద్యంగా తయారు చేసి బ్రాండెడ్ కంపెనీల బాటిల్స్‌లో నింపి ప్రముఖ బ్రాండ్ల లేబుల్ అతికించి షాపుల్లో విక్రయిస్తున్నారని అంటున్నారు. తెలుగుదేశం పార్టీ ముఖ్య నేత అనుచరుడే కల్తీ మద్యం దందా నడుపుతున్నట్టు విస్తృత ప్రచారం జరుగుతోందని గీత కార్మికుల నాయకులు ఆరోపిస్తున్నారు.

గత ప్రభుత్వంలో ఆపన్న హస్తం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గీత కార్మికులకు ఆపన్న హస్తం అందించింది. నాటి సీఎం వైఎస్ జగన్ నూతన ఎక్సైజ్ పాలసీ తీసుకువచ్చారు. గీత పన్ను రద్దు చేశారు. కల్లు గీత కార్మిక సొసైటీలు, గీత గీచే వారికి చెట్టు పథకం అమలు చేశారు. కల్లు తీస్తూ ప్రమాదానికి గురై శాశ్వత వైకల్యం పొందితే నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా శిక్షణ ఇప్పించి ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలను చూపించారు. వైఎస్సార్ బీమా పథకం ద్వారా నష్టపరిహారం చెల్లించారు. ప్రమాదాల్లో మరణిస్తే ఇచ్చే పరిహారాన్ని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచారు. ఎన్ఈఆర్‌జీఎస్, షెల్టర్ బెడ్ అభివృద్ధి పథకాల ద్వారా తాటి, ఈత వంటి చెట్లు పెంచేలా చర్యలు తీసుకున్నారు. ప్రధానంగా కాలువ గట్లు, నదీ, సాగర తీరాలను పటిష్టం చేస్తూ కల్లు గీతకు కావాల్సిన తాటి, ఈత చెట్లు సమృద్ధిగా పెరిగేలా చర్యలు తీసుకున్నారని గీత కార్మికులు గుర్తుచేసుకుంటున్నారు.

బెల్టు షాపులు తొలగించాలి



గీత వృత్తిని దెబ్బ తీస్తున్న మద్యం బెల్టు షాపులను తక్షణం తొలగించాలి. ఊరూ వాడా తేడా లేకుండా ఎక్కడపడితే అక్కడ బెల్టు షాపులు వెలియడంతో కల్లు గీత వృత్తి మరుగున పడే ప్రమాదం ఉంది. గీత వృత్తిని కాపాడేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

–బెజవాడ వెంకటేశ్వరరావు, గీత కార్మికుడు, చొదిమెళ్ల, ఏలూరు మండలం

పట్టించుకోని అధికారులు



ఉమ్మడి జిల్లాలో అక్రమ మద్యం ఏరులై పారుతున్నా ఎక్సైజ్ అధికారులు కన్నెత్తి చూడటం లేదు. నాటు సారా పేరుతో గీత కార్మికులపై దాడులు చేస్తూ వేధిస్తున్నారు. ఓపక్క కల్లు వ్యాపారం లేక ఉపాధి కోల్పోతున్న గీత కార్మికులు అధికారుల వేధింపులతో వృత్తికి దూరమవుతున్నారు.

– జుత్తిగ నరసింహమూర్తి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కల్లుగీత కార్మిక సంఘం, భీమవరం

క్లుప్తంగా

రైలు నుంచి జారిపడిన వ్యక్తి మృతి


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

భీమవరం: రైలు నుంచి జారిపడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు రైల్వే ఎస్సై ఎం.సుబ్రహ్మణ్యం చెప్పారు. ఈనెల 16వ తేదీన ఆకివీడు – ఉండి రైల్వే స్టేషన్ మధ్య 55 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి రైలు నుంచి జారిపడి గాయపడడంతో చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా భీమవరం ప్రభుత్వాసుపత్రికి అనంతరం మెరుగైన వైద్యం కోసం ఏలూరు జిల్లా ఆసుపత్రికి తరలించామన్నారు. అక్కడ ఆ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడని చెప్పారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు సెల్ 99084 48729 నంబర్‌లో సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

దెందులూరు: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఏలూరు రూరల్ ఎస్సై దుర్గాప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏలూరు రూరల్ మండలంలోని జాలిపూడి గ్రామంలో కంచర్ల తంబి (40) చేపల చెరువులపై గుమస్తాగా పనిచేస్తున్నాడు. గురువారం ఇంటి వద్దనే మద్యంలో పురుగుల మందు కలుపుకుని తాగాడు. గమనించిన బంధువులు వెంటనే అతడ్ని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

ఎరువుల పట్టివేత


ఎరువుల వ్యాన్‌ను పట్టుకున్న అధికారులు

లింగపాలెం: మండలంలోని యడవల్లి గ్రామ సమీపంలో 7 టన్నుల కాంప్లెక్స్ ఎరువులను వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తుండగా వ్యవసాయశాఖ డీఏఓ ఎస్‌కే అబీబ్ బాషా, ఏడీఏ వై సుబ్బారావు, ఏవో వి ప్రదీప్ కుమార్ పరిశీలించి సీజ్ చేశారు. వీటి విలువ రూ.2 లక్షల 6 వేలు అని తెలిపారు. కృష్ణా జిల్లా మైలవరం నుంచి ఈ ఎరువులను తరలిస్తున్నట్లు చెప్పారు. స్వాధీనం చేసుకున్న ఎరువులను మఠంగూడెం సొసైటీలో భద్రపర్చి, వ్యాన్‌ను పోలీస్ స్టేషన్‌కు అప్పగించినట్లు ఏవో ప్రదీప్ కుమార్ విలేకర్లకు తెలిపారు.

గురుకుల ఉపాధ్యాయుడికి పురస్కారం


కేంద్ర మంత్రిత్వ శాఖ కార్యదర్శి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న విజయకిరణ్

నరసాపురం రూరల్: ఎల్బీచర్ల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల గణిత ఉపాధ్యాయుడు బేతపూడి విజయ్‌కిరణ్ కేంద్ర మంత్రిత్వ శాఖ కార్యదర్శి రాహుల్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. భారత సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జాతీయ సంస్కృతుల ప్రోత్సాహంపై ఈ నెల 9 నుంచి 29 వరకూ హైదరాబాద్‌లో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విజయ్‌కిరణ్ 'ఆంధ్రప్రదేశ్‌లో చేతి వృత్తుల కళాకారుల జీవన స్థితిగతులు' అనే అంశంపై ప్రాజెక్టు సమర్పించారు. ఈ ప్రాజెక్టుకుగాను కేంద్ర మంత్రిత్వ శాఖ నుంచి ఆయనకు ప్రశంసలు లభించాయి. ఈ సందర్భంగా గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.శ్యాంప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ పి.మార్క్, నల్లి సాయిబాబు, రాజా, పాఠశాల సిబ్బంది ఉపాధ్యాయుడు విజయ్‌కిరణ్‌ను అభినందించారు.

ప్రైవేటు ఆక్వా దుకాణాలకు రెక్కలు

- కూటమి హయాంలో ప్రభుత్వ ల్యాబ్ నిర్వీర్యం
- పరికరాలు ఉన్నా.. సేవలు శూన్యం
- సచివాలయాలకే పరిమితమవుతున్న వీఎఫ్‌ఏలు


కైకలూరులో ప్రభుత్వ మత్స్యశాఖ కార్యాలయంలో ల్యాబొరేటరీ


రిఫరల్ ల్యాబ్ శ్లాబ్ పెచ్చులూడిన దృశ్యం


ల్యాబ్‌లో పరీక్షలు చేస్తున్న ఒకే ఒక్క సిబ్బంది


మూలనపడిన ఎలిషా టెస్టు యంత్రం

కైకలూరు: రాష్ట్ర తలసరి ఆదాయంలో ఏలూరు జిల్లాలో కలిదిండి, కైకలూరు రెండు మండలాలు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలుస్తున్నాయి. ఇందుకు ప్రధాన కారణం ఆక్వా రంగం. ఆక్వా ఉత్పత్తుల రవాణాలోనూ కొల్లేరు ప్రాంతాలు సింహభాగం ఆక్రమించాయి. ఆక్వా ప్రాధాన్యతను గుర్తించి రాష్ట్ర మంచినీటి సంవర్ధక రిఫరల్ ల్యాబొరేటరీని కైకలూరు మత్స్యశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. కాకినాడ తర్వాత కైకలూరు ల్యాబ్ మాత్రమే రాష్ట్ర స్థాయిలో రిఫరల్ ల్యాబ్ కావడం విశేషం. కూటమి ప్రభుత్వంలో ఈ ల్యాబ్ పాడుపడ్డా కొంపలా మారింది. కేవలం ఒకే ఒక్క సిబ్బంది పరీక్షలు నిర్వహించడం గమనార్హం. ప్రభుత్వ ఆక్వా ల్యాబ్‌లో సేవలు సక్రమంగా అందకపోవడంతో రైతులు ప్రైవేట్ ఆక్వా దుకాణాలను ఆశ్రయిస్తున్నారు.

పరికరాలున్నా.. ప్రయోజనం శూన్యం

కైకలూరులో మత్స్యశాఖ కార్యాలయంతో పాటు లాబోరేటరీని 2003లో నిర్మించారు. ఫీడ్ అనాలసిస్, మైక్రోబయోలజీ ల్యాబ్‌ను దివంగత వైఎస్.రాజశేఖరరెడ్డి పాలనలో అప్పటి మంత్రి ఎండీ.ఫరీదుద్దిన్ 2005లో ప్రారంభించారు. ల్యాబ్‌లో మైక్రోబయోలజీ, హిస్టోపాథాలజీ, నీటి, మట్టి, మేత పరీక్షలు, పీసీఆర్ టెస్టులు అందుబాటులో ఉన్నాయి. ల్యాబ్‌లో రూ.20లక్షల విలువ చేసే ఎలిషా పరికరం, అదే విధంగా రూ.13లక్షలు విలువ చేసే పీసీఆర్ మిషన్‌తో పాటు మేత పరీక్షలకు రూ.లక్షల్లో విలువ చేసే పరికరాలు అందుబాటులో ఉన్నాయి. ప్రైవేటు ల్యాబ్‌లతో పోల్చితే తక్కువ ధరకు పరీక్షలు చేస్తున్నా ఆక్వా రైతులు ఫిషరీస్ ల్యాబ్‌కు రావడం లేదు.

లైసెన్సులు లేనివి ఎన్నో..

ఆక్వా దుకాణాలు ఏర్పాటు చేయాలంటే ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆక్వా డెవలప్‌మెంట్ అథారిటీ(అప్సడా) నిబంధనలు ఖచ్చితంగా పాటించాలి. కోస్టల్ అథారిటీ అనుమతులు ఉండాలి. వీటితో పాటు డ్రగ్ లైసెన్స్, జీఎస్టీ, ఐటీ రిటర్న్, ఆథరైజ్ డీలర్‌షిప్ లెటర్స్‌తో దరఖాస్తు చేసుకున్న తర్వాత జాయింట్ కలెక్టర్ అనుమతులు పొందాలి. క్షేత్ర స్థాయిలో తహసీల్దార్, ఫిషరీస్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పొల్యూషన్ ఇలా పలు శాఖలు నిరభ్యంతర ధ్రువపత్రం ఇవ్వాలి. ఇంత తతంగం ఉన్నప్పటికీ కైకలూరు నియోజకవర్గంలో ఏకంగా 130 ఆక్వా దుకాణాలు ఉన్నాయి. వీటిలో కేవలం 39 దుకాణాలకు మాత్రమే లైసెన్సులు ఉన్నాయి.

కూటమి ప్రభుత్వంలో రెక్కలు

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత లైసెన్సులు రాకపోయినా రాజకీయ నేతల అండతో ఆక్వా దుకాణాలు తెరుస్తున్నారు. కొన్ని ప్రైవేటు ల్యాబ్‌లలో సరైన నిబంధనలు పాటించడం లేదు. ఇక పరీక్ష ధరల విషయానికి వస్తే ప్రభుత్వ ల్యాబ్‌లో నీటి పరీక్ష రూ.100 ఉంటే ప్రైవేటు ల్యాబ్‌లో రూ.200, మట్టి పరీక్ష రూ.210 ఉంటే ప్రైవేటులో రూ.300, మేతలో అన్ని పరీక్షుల కలిపి ప్రభుత్వ ల్యాబ్‌లో రూ.680 ఉంటే ప్రైవేటులో రూ.1200, పీసీఆర్ టెస్టు ప్రభుత్వ ల్యాబ్‌లో రూ.800 ఉండగా ప్రైవేటు ల్యాబ్‌లలో రూ.2,500 తీసుకుంటున్నారు. ఇక కొన్ని ఆక్వా దుకాణాల్లో మందులు కొనుగోలు చేసి చెరువులో చల్లడం వల్ల సాగు రైతులకు రూ.లక్షల్లో చేప పిల్లలు చనిపోతున్నాయి. నాసిరకం మందులపై ప్రశ్నిస్తే రాజకీయ నేతల అండతో బక్క రైతులపై దుకాణదారులు జులుం ప్రదర్శిస్తున్నారు.

వైఎస్సార్ సీపీ పాలనలో రూ.18.60 లక్షలు నిధుల కేటాయింపు

వైఎస్సార్ సీపీ పాలనలో ల్యాబ్ ఆధునికీకరణకు రూ.18.60 లక్షలు కేటాయించారు. పరికరాలు కొనుగోలుతో పాటు ఎంజైమ్ లింక్డ్ ఇమ్యునోసోర్బెంట్ ఆస్సే(ఎలిషా) టెస్టు గదిని నిర్మించారు. అయితే ఇప్పటి వరకు ప్రభుత్వం సిబ్బందిని నియమించకపోవడంతో మూతపడింది. ల్యాబ్‌లో మొత్తం 6గురు సిబ్బందికి గాను కేవలం అశోక్ అనే ఎంపీఈఓ సిబ్బంది ఒక్కరే పరీక్షలు చేస్తున్నాడు. ఇక్కడ ల్యాబ్ ఏడీ రాజ్‌కుమార్‌ను ఏలూరు ఏడీగా వేయడంతో ఆయన అక్కడ సేవలకే పరిమితమయ్యారు. గత పాలనలో సచివాలయ ఉద్యోగాల్లో భాగంగా ఇక్కడ మత్స్య సహాయకులను పరీక్షలకు నియమించారు. ఇప్పుడు వీఎఫ్‌ఏలు సచివాలయాలకు మాత్రమే పరిమితమవుతున్నారు.

పెచ్చులూడటం వాస్తవమే



కైకలూరు ఆక్వా లేబోరేటరీ బయట శ్లాబ్ పెచ్చులూడడం వాస్తవమే. ఇంజనీరింగ్ అధికారులకు తెలిపాం. ఎలిషా టెస్టుకు కాకినాడలో శిక్షణ పొందిన సిబ్బంది అవసరం. ఆక్వా దుకాణాలకు దరఖాస్తు చేసుకున్నప్పటికీ క్షేత స్థాయిలో అధికారుల లాగిన్‌లో నిలిచాయి. దుకాణాల్లో, లేబ్‌లలో ప్రభుత్వ నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకుంటాం. – బి.రాజ్‌కుమార్, మత్స్యశాఖ ల్యాడ్, ఏడీ, కైకలూరు

పూర్తి స్థాయి సిబ్బందిని నియమించాలి



ఫిషరీస్ ల్యాబ్‌ను రైతులకు అందుబాటులో ఉంచండి. సిబ్బంది లేకపోవడంతో ప్రైవేటు ల్యాబ్‌లను ఆశ్రయిస్తున్నాం. రాష్ట్ర స్థాయిలో ల్యాబ్ ఉన్నప్పటికీ ఆక్వా రైతుల నమ్మకాన్ని పొందలేకపోతుంది. ప్రభుత్వం ల్యాబ్‌కు మరమ్మతులతో పాటు పూర్తి స్థాయి సిబ్బందిని నియమించాలి.
– సమయం రామాంజనేయులు, ఆక్వా రైతు, కైకలూరు

యూనియన్ బ్యాంకు పరిహారం చెల్లించాల్సిందే

చిలకలపూడి (మచిలీపట్నం): ఖాతాదారునికి యూనియన్ బ్యాంక్ పరిహారం చెల్లించాలని వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు నందిపాటి పద్మారెడ్డి, సభ్యురాలు శ్రీలక్ష్మీరాయల గురువారం తీర్పు చెప్పారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మండలం తుందుర్రు గ్రామానికి చెందిన తోట గంగరాజుకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తుందుర్రు బ్రాంచ్‌లో సేవింగ్ అకౌంట్ ఉంది. 2023 సెప్టెంబరు 26వ తేదీన గంగరాజు డెబిట్‌కార్డు వివరాలు, ఓటీపీ చెప్పమని ఒక కాల్ వచ్చింది. వెంటనే బ్యాంకుకు వెళ్లి వివరాలు తెలియజేసి అకౌంట్స్, డెబిట్ కార్డు బ్లాక్ చేయించారు. వారం రోజుల తరువాత గంగరాజు కొత్త డెబిట్‌కార్డు తీసుకున్నారు. 2023 అక్టోబరు 5వ తేదీన రూ.1,39,200 గంగరాజు అకౌంట్ నుంచి మూడు విడతలుగా నగదు కట్ అయింది. దీంతో ఆయన యూనియన్ బ్యాంక్ వారిని కలిసి ఏ విధమైన లావాదేవీలు జరగకుండానే నగదు కట్ అయిందని ఫిర్యాదు చేశారు. అపరిచిత వ్యక్తుల వల్ల నగదు కట్ అయిందని, దానికి బ్యాంకు వారే బాధ్యులని అంటూ ఆయన వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. కమిషన్ సభ్యులు పూర్వాపరాలను విచారించి తోట గంగరాజు ఖాతా నుంచి కట్ అయిన నగదు రూ.1,39,200 యూనియన్ బ్యాంకు వారు 9 శాతం వడ్డీతో కట్ అయిన తేదీ నుంచి చెల్లించాలని, మానసిక వేదన కలిగించినందుకు రూ.25 వేలు, ఖర్చుల నిమిత్తం రూ.5 వేలు తీర్పు వెలువడిన 30 రోజుల్లోగా చెల్లించాలని ఆదేశించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


చనుబల్లి సుబ్బారావు మృతదేహం

కుక్కునూరు: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. కుక్కునూరు మండలం సీతారామపురం గ్రామానికి చెందిన చనుబల్లి సుబ్బారావు (48) గురువారం తన బైక్‌పై తెలంగాణ రాష్ట్రం అశ్వారావుపేట నుంచి కుక్కునూరు వస్తూ వినాయకపురం సమీపంలో అదుపు తప్పి బైక్‌పైనుంచి కిందకు పడిపోయాడు. తీవ్రగాయాలు కావడంతో సుబ్బారావుని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

కొడుకుపై కన్నతల్లి దాడి

తీవ్ర గాయాలపాలైన కుమారుడు


తల్లి దాడి చేయడంతో తీవ్ర గాయాల పాలైన శివ

కొయ్యలగూడెం: మానసిక, శారీరక వికలాంగుడైన కుమారుడిపై ఓ తల్లి విచక్షణ కోల్పోయి దాడి చేసింది. దీంతో అతను తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి వెళ్లిన ఘటన గురువారం జరిగింది. వివరాల ఇలా ఉన్నాయి. ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం రామానుజపురం గ్రామానికి చెందిన తొంట కుమారి భర్త గతంలోనే మృతిచెందాడు. వీరికి కుమార్తె, మానసిక, శారీరక వికలాంగుడైన కుమారుడు ఉన్నారు. కుమార్తెను ఆమె భర్త విడిచిపెట్టడంతో తల్లి దగ్గరే ఉంటోంది. గురువారం తల్లికి, కుమారుడికి మధ్య ఏర్పడిన వివాదంలో తీవ్ర ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో విచక్షణ కోల్పోయిన తల్లి కుమారుడిని తలపై కర్రతో కొట్టడంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. స్థానికులు అతన్ని 108 అంబులెన్సులో చికిత్స నిమిత్తం జంగారెడ్డిగూడెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వాహనాన్ని డెలివరీ చేసేందుకు వెళ్లి..


ఘటనా స్థలంలో ప్రసాద్ మృతదేహం

పాలకొల్లు సెంట్రల్: ద్విచక్ర వాహనాన్ని డెలివరీ చేసేందుకు వెళ్లిన వ్యక్తి లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన పాలకొల్లు నరసాపురం రహదారిలో టిడ్కో గృహాల సముదాయం సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తెన్నేటి ప్రసాద్ (38) నరసాపురంలోని ఓ ద్విచక్ర వాహనాల షోరూమ్‌లో పనిచేస్తున్నాడు. గురువారం నరసాపురం నుంచి మార్టేరు షోరూమ్‌కు వాహనాన్ని డెలివరీ చేయడానికి వెళుతున్నాడు. పాలకొల్లు దగ్గర్లో టిడ్కో గృహాల సముదాయం వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి వస్తున్న కంటైనర్ లారీ ఓవర్‌టేక్ చేసే క్రమంలో ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ప్రసాద్ లారీ వెనుక టైర్ కింద పడడంతో తల నుజ్జయి అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రసాద్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వారు తూర్పుగోదావరి జిల్లా సామర్లకోటలో నివాసం ఉంటున్నారు. ప్రసాద్ ఉద్యోగం నిమిత్తం నరసాపురంలోనే రూము తీసుకుని ఉంటున్నాడు. అతడి మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పృథ్వీ తెలిపారు.

ఆటో, వ్యాన్ ఢీకొని కూలీ మృతి

నలుగురికి గాయాలు


ఘటనా స్థలంలో సందీప్ మృతదేహం, నుజ్జయిన ఆటో

దెందులూరు: ఆటోను వ్యాన్ ఢీకొట్టిన ఘటనలో ఒక కూలీ మృతి చెందగా ఇద్దరికీ తీవ్ర, మరో ఇద్దరికీ స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన ఏలూరు రూరల్ మండలంలోని శ్రీపర్రులో గురువారం తెల్లవారుజామున 5.30 గంటలకు చోటుచేసుకుంది. వివరాల ప్రకారం రావులపాలెం నుంచి మండవల్లి రొయ్యల చెరువు పట్టుబడికి కూలీలు ఆటోలో వస్తున్నారు. ఏలూరు రూరల్ మండలం శ్రీపర్రు పెట్రోల్ బంక్ సమీపానికి వచ్చేసరికి ఆటో, భీమవరం నుంచి వస్తున్న వ్యాన్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటో నుజ్జయింది. ఆటోలో ఉన్న ఒరిస్సా రాష్ట్రం దేవిరీపల్లికి చెందిన సందీప్ కుమార్ (19) అక్కడికక్కడే మృతి చెందాడు. మిగితావారిలో ఒరిస్సాకు చెందిన రాతు, సూరజ్‌కు తీవ్రగాయాలు కాగా రాంబాబు, లక్ష్మణ్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. ఏలూరు రూరల్ తహసీల్దార్ బి విజయకుమార్‌రాజు, శ్రీపర్రు వీఆర్‌ఓ సుబ్రహ్మణ్యం, రెవెన్యూ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఏలూరు జీజీహెచ్‌కు తరలించారు. ఏలూరు రూరల్ ఎస్సై దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన వ్యాన్

క్లీనర్ మృతి, డ్రైవర్‌కు తీవ్ర గాయాలు


ఘటనా స్థలంలో ట్రాలీ లారీ


ప్రమాదంలో పూర్తిగా ధ్వంసమైన వ్యాన్


సూర్యనారాయణ మృతదేహం

ద్వారకాతిరుమల: ఆగి ఉన్న ట్రాలీ లారీని వెనుక నుంచి వ్యాన్ ఢీకొన్న ప్రమాదంలో వ్యాన్ క్లీనర్ అక్కడికక్కడే మృతి చెందగా, డ్రైవర్ తీవ్ర గాయాలపాలయ్యాడు. ఈ ఘటన మండలంలోని ఎం.నాగులపల్లి జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా, జగ్గంపేట మండలం, కాట్రావులపల్లి గ్రామానికి చెందిన వ్యాన్ క్లీనర్ యెరిట సూర్యనారాయణ (21), డ్రైవర్ జి.సురేష్ గతనెల 29న మొక్కజొన్న పొత్తులు లోడింగ్ నిమిత్తం వినుకొండ వెళ్లారు. తిరిగి లోడుతో స్వగ్రామానికి వెళుతున్న క్రమంలో ఘటనా స్థలం వద్దకు వచ్చేసరికి ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో వ్యాన్ క్లీనర్ సూర్యనారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాల పాలైన డ్రైవర్ సురేష్‌ను స్థానికులు హుటాహుటీన ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ద్వారకాతిరుమల ఎస్సై టి.సుధీర్ ఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వే గేటు దాటుతూ..


గాజులశెట్టి పూజిత (ఫైల్)

దెందులూరు: రైల్వే గేటు దాటుతున్న ఓ యువతిని రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. వివరాల ప్రకారం దెందులూరు మండలం కొత్తగూడెం గ్రామానికి చెందిన గాజులశెట్టి పూజిత (20) గురువారం సాయంత్రం గ్రామంలో రైల్వే గేటు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందిందని స్థానికులు చెబుతున్నారు.

లారీ నుంచి జారిపడి..

భీమవరం అర్బన్: లారీ నుంచి ప్రమాదవశాత్తూ జారి పడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. గూట్లపాడు గ్రామానికి చెందిన నత్తా దానియేలు ఈ నెల 27న చేపల పనికి వెళ్లి తిరిగి వస్తుండగా లారీపై నుంచి కాలు జారి ప్రమాదవశాత్తు కిందికి పడిపోయాడు. తలకు బలమైన గాయాలు కావడంతో 108 వాహనంలో భీమవరంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. దానియేలు భార్య అరుణ ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ కె.వెంకటరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తేనెటీగల పెంపకంతో ఆర్థిక వృద్ధి


తేనెటీగల పెంపకం గురించి వివరిస్తున్న కేవీకే హెడ్ సైంటిస్టు డాక్టర్ విజయలక్ష్మి

తాడేపల్లిగూడెం: తేనెటీగల పెంపకంతో ఆర్థిక స్వయం సమృద్ధి సాధించవచ్చని సీనియర్ సైంటిస్టు డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. వెంకట్రామన్నగూడెంలోని కేవీకేలో గురువారం ప్రారంభమైన తేనెటీగల పెంపకం శిక్షణా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. తేనెను శాస్త్రీయంగా ఎలా ప్రోసెస్ చేయాలి, నాణ్యమైన తేనెను మిషనరీ ద్వారా కలుషితం లేకుండా బాట్లింగ్ వరకు ఎలా తీసుకురావాలనే విషయాలను విశదీకరిరంచారు. రూ.20 వేలతో ఒక ఎకరానికి నాలుగు బాక్సులు, రూ.5 వేలతో కావాల్సిన పరికరాలు కొనుగోలు చేసి ఉద్యాన పంటల మధ్య ఖాళీ స్థలంలో బాక్సులు ఎలా అమర్చాలనే విషయాల గురించి చెప్పారు. తేనె ఉప ఉత్పత్తులుగా మైనం, పుప్పొడి, జెల్లీ, విషం తయారు చేసి ఎకరాకు రూ.లక్ష ఆదాయం పొందవచ్చన్నారు. గాఢమైన పురుగుమందులు కొట్టే తోటల పక్కన కాని, రైల్వే ట్రాకుల పక్కన, విద్యుత్ స్తంభాల పక్కన తేనెటీగల పెంపకం కోసం బాక్సులు ఏర్పాటు చేయకూడదన్నారు. మూడు రోజుల పాటు శిక్షణలో తేనెటీగల పెంపకం, యాజమాన్య పద్ధతులు, తెగుళ్ల, నివారణ చర్యలు గురించి వివరిస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ దీప్తి, దేవీవరప్రసాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొని వ్యక్తి మృతి

తాడేపల్లిగూడెం రూరల్: విద్యుత్ స్తంభాన్ని మోటారు సైకిల్ ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. వివరాల ప్రకారం మండలంలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన దండే శ్రీను (21) గురువారం బాదంపూడి నుంచి స్వగ్రామం మోటారు సైకిల్‌పై వస్తుండగా, నవాబుపాలెం వద్దకు వచ్చే సరికి కుక్కను తప్పించబోయి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. శ్రీను సోదరుడు చందు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్సై జేవీఎన్.ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సేంద్రియ సాగుతో ఖర్చు ఆదా


మెట్ట ప్రాంతంలో సేంద్రియ ఎరువు కోసం పచ్చిరొట్ట సాగు చేపడుతున్న రైతులు

చింతలపూడి: రైతులు సేంద్రియ ఎరువులను వాడాలని చింతలపూడి వ్యవసాయ సబ్ డివిజన్ సహాయ సంచాలకులు వై సుబ్బారావు సూచిస్తున్నారు. ప్రస్తుత తరుణంలో రసాయన ఎరువులు అధికంగా ఉపయోగించడం వల్ల సాగు ఖర్చులు పెరిగి రైతులు నష్టాల్లో కూరుకు పోతున్నారని, సేంద్రియ సాగుతో ఖర్చులు తగ్గి లాభాలు చేకూరుతాయని తెలిపారు.

సేంద్రియ ఎరువులు అంటే

సేంద్రియ ఎరువుల్లో పశువుల ఎరువు, వానపాముల ఎరువు, గొర్రెలు, కోళ్ల ఎరువులు, పచ్చి రొట్ట ఎరువులు ముఖ్యమైనవి. వీటి వాడకం వల్ల భూమి సహజ స్థితిని పొందడమే కాక, పంటకు ప్రధాన పోషకాలు, సూక్ష్మ పోషకాలు లభిస్తాయి. నాణ్యమైన, విష రహితమైన పంటలను పండించవచ్చు. వీటితో పాటు వేరుశనగ, వేప, పొద్దు తిరుగుడు, ఆముదం చెక్కలను వాడడం వలన మొక్కలకు పోషక పదార్థాలు ఎక్కువగా లభిస్తాయి.

పచ్చిరొట్ట ఎరువులు: సమగ్ర పోషక యాజమాన్యంలో పచ్చిరొట్ట ఎరువులు ప్రధానమైనవి. పచ్చిరొట్టతో వివిధ పంటల్లో దిగుబడి గణనీయంగా పెరుగుతుంది. పచ్చిరొట్టలో జీలుగ, జనుము, పిల్లి పెసర, అలసంద, పెసర, మినుము ముఖ్యమైనవి.

జీవ ఎరువులు: పంటల పెరుగుదలకు కావలసిన పోషకాలను అందించే సూక్ష్మ జీవకణాల సముదాయాలను జీవన ఎరువులు అంటారు. వీటిలో నత్రజనిని స్థిరీకరించేవి రైజోబియం, నీలి ఆకుపచ్చ ఆకు, అజిటో బ్యాక్టీరియ, అజో స్పైరిల్లం, అజొల్లా ఒక రకం కాగా, భాస్వరంను భూమిలో లభ్యమయ్యేలా చేసే ఫాస్ఫో బ్యాక్టీరియ రెండోది.

నీలి ఆకుపచ్చ నాచు: ఎకరాకు 4 కిలోల నాచు పొడిని ఇసుకతో కలిపి మడి అంతా సమానంగా పడేటట్లు వేయాలి. 7–10 రోజుల మధ్య మడిలో నీరు పెట్టాలి. నాచు గాలిలోని నత్రజనిని తీసుకుని స్థిరీకరిస్తుంది. దీనివలన ఎకరాకు 8–12 కిలోల నత్రజని పంటకు అంది దిగుబడి పెరుగుతుంది.

అజిటో బ్యాక్టర్: ఒక ఎకరానికి సరిపడే విత్తనానికి 200–400 గ్రాముల కల్చరును పట్టించాలి. లేదా కిలో కల్చరును 20 కిలోల పశువుల ఎరువుతో కలిపి ఎకరం నేలపై చల్లాలి. వరి, చెరకు, జొన్న, పత్తి, సజ్జ, మిరప పంటల్లో వేసుకుంటే మంచిది. దీని వల్ల ఎకరానికి 8–16 కిలోల నత్రజని పైరుకు అందుతుంది.

అజొల్లా: దమ్ములో ఎకరానికి 50 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్‌ను వేసి పలుచగా నీరు పెట్టి 100–150 కిలోల అజొల్లా వేసి 2–3 వారాల తరువాత నేలలో కలియ దున్నాలి. ఎకరానికి 3 టన్నుల పచ్చిరొట్టతో 12 కిలోల నత్రజని అందుతుంది.

భాస్వరపు జీవన ఎరువు: ఫాస్ఫో బ్యాక్టీరియ భూమిలో లభ్యంకాని స్థితిలోని భాస్వరాన్ని లభ్యమయ్యేలా చేస్తుంది. ఎకరాకు సరిపడే విత్తనంలో 200–400 గ్రాముల కల్చర్‌ను పట్టించాలి. లేదా ఒక కిలో కల్చరును 20 కిలోల పశువుల ఎరువుతో కలిపి ఎకరం నేలలో వేయాలి. ఇక రైతులు రసాయనిక ఎరువులను సిఫార్సు చేసిన మోతాదులోనే వాడాలని, అధిక మోతాదులో వాడితే పురుగులు, తెగుళ్ల అధికమై పంట దెబ్బతినే ప్రమాదం ఉందని సుబ్బారావు తెలిపారు.


వై సుబ్బారావు, వ్యవసాయ సహాయ సంచాలకులు

సాక్షి క్లాసిఫైడ్స్

Education

DISTANCE EDUCATION
■ 6 నెలల్లో any డిగ్రీ, PG, డిప్లొమా, B.tech, BAMS, BHMS, D. ఫార్మసీ, B. ఫార్మసీ, LLB, U.G.C యూనివర్శిటీస్ నుండి పూర్తిచేయండి. ✆ 99895 30727 [SCA25006840]



Wanted

■ కన్సల్టెన్సీ కాదు.VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవారు,RMP &డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు -40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.9014885406 [HA-16104]

■ స్వామి వివేకానంద ఓల్డేజ్ హోం (VJA) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు 10th ఆపై చదివి, Age: 20-30 కలిగిన (M/F) వర్కర్లు కావలెను. భో+వ+జీ: 18-20 వేలు. ఏజెంట్ల కమీషన్: 5000 ✆ 9959021122, 9949021122 [B-1275595]

గమనిక : సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలిం చిన పిదప ప్రతి స్పందించాల్సింది గా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

శివాలయ నిర్మాణానికి విరాళం


ప్రత్తిపాడు శివాలయానికి విరాళం అందజేస్తున్న గ్రంధి సత్యనారాయణ

పెంటపాడు: మండలంలోని ప్రత్తిపాడు గ్రామంలో నూతనంగా ప్రతిమాంబసమేత సదాశివస్వామి ఆలయం నిర్మాణం వేగంగా జరుగుతోంది. గ్రామస్తులు, ఆలయకమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ఆలయానికి ఇప్పటికే పలువురు విరాళాలు అందించారు. గురువారం తాడేపల్లిగూడెంకు చెందిన ప్రముఖులు, ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, పెదతాడేపల్లి వాసవి కళాశాల చైర్మన్, గ్రంధి సత్యనారాయణ, రత్నావళి దంపతులు, ఆలయ నిర్మాణానికి రూ. 1,00.116లు అందజేశారు. ఈ సందర్భంగా ఈ మొత్తాన్ని ఆలయ నిర్వాహకులు, కమిటీ చైర్మన్ వీర్లకృష్ణకు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు జవ్వాది శేషగిరి, వీర్ల ధనరాజు, కామిశెట్టి ధనరాజు, వీర్ల సత్యనారాయణ, కడకట్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

దేవునికి లోబడి జీవించాలి


ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న దృశ్యం

పెంటపాడు: తణుకు ఇమ్మానియేలు ప్రేయర్ ఫెలోషిప్(ఈపీఎఫ్)లో ఈనెల 30 నుంచి జరుగుతున్న నెలవారీ ఉపవాస సమావేశాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా గురువారం రాత్రి ఈపీఎఫ్ సంఘ అధ్యక్షుడు పరస మోజెస్ ప్రవీణ్ విశ్వాసులతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దేవునికి విధేయులై విజ్ఞాపనలు తప్పక చేయాలన్నారు. దీంతో పాటు, ఆధ్యాత్మిక జీవనంతో జీవించాలన్నారు.శనివారం రాత్రి 9 గంటల నుంచి సంపూర్ణ రాత్రి ప్రార్థన ఉంటుందన్నారు. సంఘ వ్యవస్థాపక అధ్యక్షురాలు పరస అరుణకుమారి, దైవసేవకురాలు ఫ్రైజీ సంఘ విశ్వాసులు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ వ్యవస్థ పనితీరును తెలుసుకోవాలి

నరసాపురం: విద్యార్థులు పోలీసు వ్యవస్థ పనితీరు ఎలా ఉంటుంది? పోలీసులు ఎలా పనిచేస్తారు? అనే విషయాలను తెలుసుకోవాలని పట్టణ ఎస్సై సీహెచ్ జయలక్ష్మి చెప్పారు. పట్టణంలోని ఐరిష్ఫ్లోరిస్ట్ ప్లేస్కూల్ విద్యార్థులతో గురువారం పోలీస్ స్టేషన్స్ విజిట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. టౌన్‌స్టేషన్, రూరల్ స్టేషన్‌లకు విద్యార్థులను తీసుకెళ్లి పోలీసులు ఏంచేస్తారు? నేరాల అదుపు చేసేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటారు? సీసీ కెమెరాల పనితీరు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై జయలక్ష్మి విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. స్కూల్ కరస్పాండెంట్ వై.జాన్‌కుమార్, డైరెక్టర్, స్టేట్ క్రిష్టియన్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ నళిని పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఒప్పందం రద్దు చేయాలి

తణుకు అర్బన్: విద్యుత్ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా తణుకులో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం తణుకు సబ్ డివిజన్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దిర్సిపో రామకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చుక్కాకుల వరలక్ష్మి, రుద్రా అన్నవరం, అన్నెపు శ్రీను, ప్రసాద్ పాల్గొన్నారు.

ఆగి ఉన్న ఆటోను ఢీకొట్టిన లారీ

ఉండి: ఉండి శివారు పాముపలపర్రుకు సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు గాయాలపాలయ్యారు. పాములపర్రు వైపు నుంచి ఉండి వైపుగా వస్తున్న బాక్స్ లారీ అదే వైపున ఆగి ఉన్న ఆటోను ఢీకొట్టడంతో దానిలో ఉన్న ముగ్గురు వ్యక్తులు గాయాలపాలయ్యారు. దీంతో క్షతగాత్రులను భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడవారు చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై తమకు ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేస్తామని ఎస్సై ఎండీ నసీరుల్లా తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

భీమవరం: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలని అడిషనల్ ఎస్పీ వి భీమారావు అన్నారు. గురువారం ప్లాస్టిక్ నిషేధ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్లాస్టిక్ నిషేధ పోస్టర్‌ను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్లాస్టిక్ ఉత్పత్తులపై నిషేధాన్ని కఠినంగా అమలు చేయాలని, ప్లాస్టిక్ వినియోగం విడనాడి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్లాస్టిక్ నిషేధ కమిటీ సభ్యులు చెరుకువాడ రంగసాయి, టీవీవీ ప్రసాద్ మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధంపై ప్రభుత్వం ప్రతినెలా మూడో శనివారం స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్ర పేరుతో కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీ సీఐ దేశంశెట్టి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా కియోస్క్‌లు

- కియోస్క్ స్థానంలో పీఎంఎఐడి యాప్ ఏర్పాటు
- కొత్త యాప్‌లో అరకొర సేవలు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు

ఇరగవరం: ఎరువులు, పురుగుమందుల కొనుగోలు కోసం రైతు సేవా కేంద్రాలకు సమకూర్చిన కియోస్క్‌లు మూలనపడ్డాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, కార్యక్రమాలను నీరుగార్చేందుకు కూటమి ప్రభుత్వం కంకణం కట్టుకుంది. ఇప్పటికే గత ప్రభుత్వం అమలు చేసిన పలు పథకాలు రద్దు చేస్తుండగా మరికొన్నింటికి పేర్లు మార్చివేస్తోంది. గ్రామ స్వరాజ్య స్థాపనే లక్ష్యంగా సచివాలయం, రైతు సంక్షేమమే ధ్యేయంగా ఏర్పాటు చేసిన రైతు రైతు భరోసా కేంద్రం సైతం ప్రస్తుత ప్రభుత్వం నిర్వీర్యం చేసే దిశగా అడుగులు వేస్తోంది. ముఖ్యంగా రైతులకు వారి ఊరిలోనే నాణ్యమైన విత్తనాలు, ఎరువులతో పాటు వారికి అవసరమైన సేవలు అందించేందుకు జగన్ ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాల్లో రైతులకు కావాల్సిన వ్యవసాయ సేవలను ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసేందుకు వీలుగా కియోస్క్ యంత్రలను ఆర్‌బీకేల్లో ఏర్పాటు చేసింది. అయితే ప్రస్తుతం కియోస్క్‌లు ఆర్‌బీకేల్లో నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. రైతులుకు కావాల్సిన ఎరువులు, యంత్ర పరికరాలు, పశువుల దాణ, మార్కెటింగ్ వంటి అన్ని రకాల సేవలను ఆన్‌లైన్‌లో పొందేందుకు గత ప్రభుత్వం కియోస్క్ యంత్రాలను ఏర్పాటు చేశారు. అలాగే ఈ యంత్రలు ద్వారా రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, యంత్ర పరికరాలను ఆన్‌లైన్‌లో ముందుగానే నమోదు చేసుకొనేవారు. ఆయా ప్రాంతాల్లో వ్యవసాయ


ఇల్లిందలపర్రు ఆర్‌బీకేలో నిరుపయోగంగా ఉన్న కియోస్క్ యంత్రం

ఉత్పత్తుల దరలు, వ్యవసాయ పంటల యాజమాన్య పద్ధతులపై సమాచారం వీడియోల రూపంలో తెలుసుకొనేవారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రభుత్వ సర్వర్లు పనిచేయకపోవడంతో సచివాలయ సేవలు ఒక్కొక్కటిగా నిలిచిపోతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.

నియోజకవర్గంలో 55 ఆర్‌బీకేలు

నియోజకవర్గంలోని మండలాల పరిధిలో గత ప్రభుత్వం 55రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ ఆర్‌బీకేల్లో 55 కియోస్క్ యంత్ర పరికరాలను రైతులకు సేవలందించేలా ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం ఆర్‌బీకేల్లో ఉన్న పరికరాలు కేవలం ఎరువుల అమ్మకాలకు మాత్రమే ఉపయోగిస్తూ మిగిలిన సేవలకు దూరంగా ఉంటున్నాయి. అయితే అధికారులు మాత్రం వాటిని వినియోగిస్తున్నామని చెబుతున్నారు.

పీఎంఏఐడీ యాప్ ఏర్పాటు

రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన కియోస్క్ పరికరాల స్థానంలో పీఎంఏఐడీ యాప్‌ను గత ప్రభుత్వం ఏర్పాటుచేసింది. దీని వల్ల అరకొర సేవలు మాత్రమే అందుతున్నాయని రైతులు చెబుతున్నారు. గత ప్రభుత్వంలో ఏర్పాటుచేసిన కియోస్క్ యంత్రాలను నిరుపయోగంగాఉంచడం సరికాదని, ఆ యంత్రాల్లో గతంలో మాదిరిగానే పూర్తి స్థాయిలో సేవలందించాలని రైతులు కోరుతున్నారు.

కియోస్క్ సేవలు కొనసాగించాలి



రైతు సంక్షేమానికి గత ప్రభుత్వం ఆర్‌బీకేల్లో ఏర్పాటు చేసిన కియోస్క్ యంత్ర సేవలు కొనసాగించాలి. ఎరువులు, పురుగు మందులు నమోదుతోపాటు మార్కెటింగ్ సౌకర్యాలను తెలుసుకొనేందుకు కియోస్క్ యంత్రాలు ఎంతగానో ఉపయోగపడేవి. రైతుల ఉపయోగపడే సేవలను కొనసాగించాలి. – మంగిన రామనాయుడు, రైతు, ఎంపీటీసీ ఇరగవరం

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తణుకు అర్బన్: తణుకు సబ్ డివిజన్ పరిధిలోని తణుకు, అత్తిలి, ఇరగవరం, తేతలి సబ్ స్టేషన్‌లలో విద్యుత్ లైన్స్ మరమ్మతుల, నిర్వహణ నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని విద్యుత్ శాఖ డివిజినల్ ఇంజనీరు కె.నరసింహమూర్తి తెలిపారు. తణుకు పట్టణ పరిధిలోని ఎసీఆర్ పార్కు, సాయి హాస్పటల్, ఎన్జీవో కాలనీ, కొండాలమ్మ పుంత, ఉమెన్స్ కళాశాల, డీ మార్ట్, పాతవూరు, ఇరగవరం కాలనీ, శివబాలాజీ నగర్, మునిసిపల్ కార్యాలయ ప్రాంతం, కొమ్మాయిచెర్వు గట్టు, తణుకు రూరల్ పరిధిలో తేతలి హౌసింగ్ కాలనీ, ఇందిరా నగర్, తేతలి పారిశ్రామిక ప్రాంతం, వడ్డూరు, చివటం, అత్తిలి మండలంలో అత్తిలి, పాలి, ఆరవల్లి, దంతుపల్లి, మంచిలి, ఉరదాళ్లపాలెం, పాలూరు, కేపీసగట్టు, బల్లిపాడు, గుమ్మంపాడు, వరిగేడు, తిరుపతిపురం, శివపురం, కొమ్మర, ఈడూరు, కంచుమర్రు, స్కిన్నెరపురం, సీహెచ్ చెర్వు గ్రామాలు, ఇరగవరం మండలంలో ఇరగవరం, హనుమాజీపాలెం, చినరామునిచెరువు, గొల్లమాలపల్లి, కంతేరు, కొత్తపాడు, కత్తవపాడు, పాదలాడ, కాకిలేరు, పేకేరు, అయితంపూడి, ఏలేటిపాడు, రాపాక, అయినపర్రు, అర్జునుడిపాలెం, ఓగిడి, పెద్దిరెడ్డిపాలెం, తూర్పు విప్పర్రు, కేకే వల్లి, ఆర్‌కంద్రిక, కాకుల ఇల్లింద్రపర్రు, నారాయణపురం, గోటేరు, యర్రాయిచెర్వు, గోపాలపురం, కేతావారిపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు ఇవే

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని సౌత్ పరిధిలో 33/11కేవీ ఎస్ఎస్ యాగర్లపల్లి సబ్ స్టేషన్, భాగ్యలక్ష్మిపేట సెక్షన్, 11కేవీ పడాల ఫీడర్‌కు సంబంధించి శుక్రవారం ఉదయం 8.30 నుంచి 2.30 గంటల వరకు విద్యుత్ తీగలకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించేందుకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం డివిజన్ ఈఈ కె.నరసింహమూర్తి వెల్లడించారు. టూ టౌన్ పరిధిలో పడాల గురువు, పరిసర ప్రాంతాలు, ముత్యాలంభపురం ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నందున, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఫ్యాప్టో వెస్టుగోదావరి యూనిట్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం నిమిత్తం ఆగస్టు2న భీమవరం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు, ఏపీటీఎఫ్ జిల్లా శాఖ నాయకులు పిలుపునిచ్చారు. గురువారం జిల్లా శాఖ అధ్యక్షుడు జి.ప్రకాశం, ప్రధాన కార్యదర్శి బీవీ నారాయణలు మాట్లాడుతూ పీఆర్‌సీ, మధ్యంతర భృతి, కారుణ్య నియామకాలు, సీపీఎస్ రద్దు, యాప్‌లు భారం తగ్గించాలని, ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని, ఎంఈఓ ప్రమోషన్‌లు వ్యవహారంలో ప్రభుత్వ ఉపాధ్యాయులతో పాటు మండల, జిల్లా పరిషత్తు, మునిసిపల్ ఉపాధ్యాయులకు కూడా కల్పించాలని కోరారు. పెండింగ్ బకాయిలతో పాటు, పలు సమస్యలను పరిష్కరించాలని కోరారు.

6న ఉచిత వైద్య శిబిరం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో క్రీస్తు సంఘం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎల్అండ్‌టి కాలనీ, టిడ్కో గృహాలు వద్ద క్రీస్తు సంఘం చర్చి వద్ద ఆగస్టు 6వ తేదీన బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు చర్చి నిర్వాహకులు రొక్కాల నాగబుజ్జి వెల్లడించారు. ఏలూరు ఆశ్రమ ఆసుపత్రి వైద్యులు ఎముకలు, స్త్రీలు, పిల్లలు, జనరల్, చర్మవ్యాధులు, చెవి, ముక్కు, గొంతు, కంటి వ్యాధులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని స్థానిక ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

154 స్పౌజ్ పింఛన్ల మంజూరు

పెనుగొండ: పింఛను పొందే భర్త మరణించిన 154 మంది వితంతవులకు కొత్తగా స్పౌజ్ పింఛన్లు మంజూరయ్యాయని ఆచంట ఎంపీడీఓ బి కృష్ణమోహన్ తెలిపారు. గురువారం ఆచంట ఎంపీడీవో కార్యాలయంలో పింఛన్ల పంపిణీపై సమీక్ష నిర్వహించారు. వారికి గాను రూ.6, 16,000 బ్యాంకుల నుంచి నగదు డ్రా చేసి ఆగష్టు ఒకటో తేదీన ఆయా గ్రామాల ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా పంపిణీ చేయాలని కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు. పేదరిక నిర్మూలన పీ–4 నీడ్ అసిస్టెంట్ సర్వే వేగవంతం చేసి ఆగస్టు 3 నాటికి నూరు శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ ఎంపీడీఓ కె.బులి సూరన్న, కార్యదర్శులు నాగబాబు, హనుమంతరావు, దుర్గాప్రసాద్, జానకి, సభ్యులు పాల్గొన్నారు.

దాట్ల సేవలు ఆదర్శనీయం

పెనుమంట్ర: కల్లుగీత కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా తన జీవితాన్ని అంకితం చేసిన ఎస్ఆర్ దాట్ల సేవలు నేటి తరానికి ఆదర్శనీయమని సీపీఎం రాష్ట్ర నాయకుడు మంతెన సీతారాం అన్నారు. అత్తిలి మాజీ శాసనసభ్యుడు, రాష్ట్ర కల్లు గీత కార్మిక ఉద్యమ నేత స్వర్గీయ ఎస్ఆర్ దాట్ల 46వ వర్ధంతి సందర్భంగా అయన స్వగ్రామమైన పెనుమంట్రలోని ఆయన స్మారక స్థూపం వద్ద సీపీఎం, కల్లు గీత కార్మిక సంఘాల ఆధ్వర్యంలో వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ దాట్ల కుటుంబ సభ్యులు నేటికీ ఎస్ఆర్ దాట్ల ట్రస్ట్ పేరుతో పేదలకు ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయమన్నారు. ముందుగా బ్రాహ్మణ చెరువు సివిల్ సప్లైస్ గోడౌన్ నుంచి పెనుమంట్ర వరకు ర్యాలీగా బయలుదేరి స్మార్క స్థూపం వద్ద ఎస్ఆర్ దాట్ల తో చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం స్థానిక లూథరన్ చర్చి వద్ద ఎస్ ఆర్ దాట్ల మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హైదరాబాద్ కు చెందిన బయోలాజికల్ ఇ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. కార్యక్రమంలో గీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మూర్తి, డాక్టర్ డి.సందీప్ వర్మ, సర్పంచ్ తాడిపర్తి ప్రియాంక ప్రసన్న, చిలుకూరి రాఘవ రాజు సుందరి, గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కామన మునిస్వామి పాల్గొన్నారు.


ఉచిత మెడికల్ క్యాంపును ప్రారంభిస్తున్న సర్పంచ్ తాడిపర్తి ప్రియాంక

గోవులకు రేడియం బెల్ట్‌లు

పాలకొల్లు సెంట్రల్: రోడ్డుపై తిరుగుతున్న గోవులు అనేక ప్రమాదాలకు గురవుతున్నాయని వాటిని రక్షించే ప్రక్రియలో భాగంగా గోవుల మెడలో రేడియం బెల్ట్‌లను వేసినట్లు పట్టణ బీజేపీ అధ్యక్షుడు కొల్లి కొండప్రసాద్ తెలిపారు. బుధవారం రాత్రి రోడ్డుపై తిరుగుతున్న గోవులకు రేడియం బెల్ట్‌లు వేశారు. ఈ సందర్భంగా కొండ ప్రసాద్ మాట్లాడుతూ రాత్రి వేళల్లో వాహనాలు గోవులను ఢీకొట్టి వెళ్లిపోతున్నాయని అన్నారు. కాబట్టి వాటిని రక్షించాలనే సంకల్పంతో ఈ బెల్టులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జక్కంపూడి కుమార్, గవర పవన్ నాయుడు, బోడ కనకరాజు, చెరుకూరి శ్రీనివాస్, మల్లవోలు సురేష్, కీర్తిచంద్, జవ్వాది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్యలేమి

- అలంపురంలో పందుల స్వైర విహారం
- పట్టించుకోని అధికారులు

పెంటపాడు: మండలంలో పలు గ్రామాల్లో ప్రజలు మురుగుతోనే సహవాసం చేస్తున్నారు. రోడ్లపై ఎక్కడ చూసినా మురుగునీరే ఉండడంతో దుర్గంధంతో ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులు సైతం అటువైపు చూడకపోవడంతో పలు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కనీసం నాయకులు గానీ, అధికారులు గానీ పట్టించుకుని రోడ్లపైకి నీరు వదలకుండా చర్యలుకూడా తీసుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మురుగునీరువల్ల దోమలు ప్రబలి వ్యాధుల బారిన పడుతున్నా కనీసం బ్లీచింగ్ కూడా చల్లించని దయనీయ పరిస్థితి గ్రామాల్లో నెలకొంది. మండలంలో ప్రధానంగా అలంపురంలో గ్రామంలో పందులు రోడ్లపైకి వచ్చి స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం గ్రామ కార్యదర్శితోపాటు, సచివాలయ సిబ్బంది, ఆరోగ్యసిబ్బంది ఆ దారిగుండానే వెళ్లాలి. అయితే అక్కడే రోడ్డుకు పక్కనే టైర్లు వేసి పందులకు మేత తినిపిస్తున్నారు. ఆ ప్రాంతం నిత్యం దుర్గంధం వెదజల్లుతోంది. మిడ్‌లెవిల్ కాలువ కూడా కలుషితం అవుతోంది. మిడ్‌లెవల్ కాలువ పరిసర ప్రాంతాల్లో దుర్వాస వస్తున్నా పంచాయతీ సిబ్బంది పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుద్ధ్యానికి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.


అలంపురంలో రోడ్డుపై పందుల స్వైర విహారం


కె.పెంటపాడులో రోడ్డుపై నిలిచిన వర్షం నీరు


అలంపురంలో రోడ్డుపై వేసిన చెత్త


బి.కొండేపాడులో ప్లాస్టిక్ వ్యర్థాలు

పరిసరాల పరిశుభ్రత పాటించాలి


గుమ్మంపాడులో దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరిస్తున్న వైద్యులు

అత్తిలి: వర్షాకాలంలో 'డ్రైడే' పాటించడం ద్వారా దోమ పుట్టుకకు చెక్ పెట్టవచ్చని తణుకు సబ్ యూనిట్ ఆఫీసర్ గుడిమెట్ల వెంకటేశ్వరరావు అన్నారు. అత్తిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గుమ్మంపాడు గ్రామంలో గురువారం ఆయన వైద్యాధికారి డాక్టర్ కె.నాగరాజుతో కలిసి క్షేత్ర స్థాయిలో గృహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గృహాల వద్ద రుబ్బు రోళ్లు, నిరుపయోగ సామగ్రిలో దోమ లార్వా ఉన్నట్లు గుర్తించామన్నారు. ఇలా కొనసాగితే అడల్ట్ మస్కిటో పెరిగే అవకాశం ఉందని తెలిపారు. ఆశా కార్యకర్తలు ప్రజలు డ్రైడే పాటించేలా చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా ప్రతి గృహాన్ని సందర్శించి, గుర్తించిన లార్వాను గృహవాసులచే తొలగింపు చేయాలని కోరారు. ప్రజలు చేతుల శుభ్రత, ఆహార పదార్థాలు ఉన్న పాత్రలపై ఈగలు వాలకుండా విధిగా మూతలు ఉంచాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఫైలేరియా కంట్రోల్ యూనిట్ సూపర్‌వైజర్ కె. సత్యన్నారాయణ, హెల్త్ సూపర్‌వైజర్ సీహెచ్ వెంకటరాజు, మహిళా హెల్త్ సూపర్‌వైజర్ జి.అమ్మాజి, హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ సీహెచ్ఓ బి.సుభద్ర, హెల్త్ అసిస్టెంట్స్ జె.ఎస్.గనిరాజు, టి నాగకృష్ణ, ఎస్.సూర్యనారాయణ, డి.సుబ్రహ్మణ్యం, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాపులు తొలగించే వరకు ఉద్యమం


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు కామన మునిస్వామి

పెనుమంట్ర: బెల్ట్ షాపులు తొలగించే వరకు గీత కార్మికుల పోరాటం ఆగదని ఆంధ్రప్రదేశ్ కల్లు గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కామన మునిస్వామి అన్నారు. గురువారం పెనుమంట్రలో కల్లు గీత కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కామన మునిస్వామి మాట్లాడుతూ జిల్లాలో ఐదు వేల బెల్ట్ షాపులు ఉన్నాయని వాటిని అరికట్టడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. బెల్టు షాపుల వల్ల గీత కార్మికుల కల్లు అమ్ముడుకాకపోవడంతో పస్తులు ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గీత కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని బెల్ట్ షాపులు ఉంటే బెల్ట్ తీస్తామని ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి వాగ్ధానం చేశారని గుర్తు చేశారు. తాడి, ఈత చెట్లపై నుంచి ప్రమాదవశాత్తూ పడి మృతి చెందిన, వికలాంగులైన వారికి ఒక రూపాయి కూడా ఎక్స్‌గ్రేషియా ఇవ్వడం లేదని వాపోయారు. ఆదరణ పథకం పేరుతో గీత కార్మికులను ఆదుకుంటామని చెప్పినా ఆ మేరకు చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. గీత కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బొక్క చంటి , దాసరి సూరిబాబు, జిల్లా నాయకులు బొంతు శీను, చింతపల్లి చిన్న వీరస్వామి, జక్కంచేతి సత్యనారాయణ రాజులపాటి సాంబశివరావు, వీరంకి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లైన్‌మేన్‌పై కొనసాగుతున్న విచారణ


అర్తమూరులో విచారణ చేస్తున్న విద్యుత్ అధికారులు

ఉండి: మండలంలోని అర్తమూరు, చెరుకువాడ గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న జూనియర్ లైన్ మేన్ దాసరి రాజుపై అవినీతి ఆరోపణలు రావడంతో గురువారం అధికారులు రంగంలోకి దిగారు. ఉదయం నుంచి విద్యుత్ శాఖ అధికారులు గ్రామంలోని పలువురు ఆక్వారైతుల వద్దకు వెళ్లి విచారణ చేపట్టారు. విద్యుత్ బిల్లుల్లో తేడాలు, మీటర్ రీడింగ్‌లో వ్యత్యాసాలపై ఆరా తీశారు. అయితే మరికొంత మంది ఆక్వా రైతులను విచారించాల్సిఉందని శుక్రవారం విచారణ చేపడతామని తెలిపారు. దీనిపై రైతులు చెప్పిన విషయాలను ఉన్నతాధికారులకు నివేదక రూపంలో సమర్పిస్తామని ఏఈ పులగం శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో రఘునాథ్‌బాబు, ఎస్ఈ, డీఈ వెంకటేశ్వరరావు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో రోడ్డు వద్దని నిరసన

ఉండి: శ్మశానవాటికలో రోడ్డువేయవద్దంటూ మండలంలోని పాములపర్రు గ్రామంలో దళితులు గురువారం నిరసనకు దిగారు. గ్రామానికి చెందిన దళితులు తరతరాలుగా ఉండి గణపవరం రోడ్డు పక్కనే వంతెన వద్ద నిర్వహించుకుంటున్న శ్మశానవాటికను ఆనుకుని ఉన్న కొందరు ఆక్వారైతుల కోరిక మేరకు శ్మశానం మీదుగా 20 అడుగుల రోడ్డు వేసేందుకు ప్రజాప్రతినిధులను కోరారు. దీంతో అధికారులు గత కొద్దిరోజులనుండి సర్వే పనులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో సర్వేను దళితులు అడ్డుకుని గురువారం టెంట్‌వేసి నిరసనకు దిగారు. సదరు సమాచారం అందుకున్న పోలీసులు ఎస్సై ఎండీ నసీరుల్లా ఆధ్వర్యంలో పోలీసులు నిరసనకు అనుమతి లేదని వెంటనే టెంట్లు తొలగించాలని నిరసన తెలుపుతున్న వారిని చెదరగొట్టారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు. తమకు అన్యాయం జరుగుతుందని తమ పూర్వికుల సమాధులను తొలగించి రోడ్డువేసే ప్రయత్నం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. శ్మశానం వెనుక నుంచి కోలమూరు వరకు ఆక్వా చెరువులకు రోడ్డుఉండగా నేరుగా ప్రధాన రహదారి వెళ్లిపోవాలని కొందరు ఆక్వారైతుల కోరికమేరకు శ్మశానంలో నుంచి రోడ్డు వేయడం ఎంత వరకు సమంజసం? అని దళితులు ప్రశ్నిస్తున్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలి


బాడవ గ్రామ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)

యలమంచిలి: కూటమి ప్రభుత్వ వైఫల్యాలను, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల మోసాలను ప్రజలకు వివరించడం ద్వారా వైఎస్సార్ సీపీ బలోపేతానికి కార్యకర్తలంతా కృషి చేయాలని వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) కోరారు. బాడవ గ్రామంలో గురువారం రాత్రి నిర్వహించిన పార్టీ గ్రామ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ అధిష్టానం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్న బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని మారుమూల పల్లెలకు సైతం తీసుకెళ్లాలని ఆయన కోరారు. అనంతరం మండల కమిటీ, అనుబంధ కమిటీలు గురించి చర్చించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు ఉచ్చుల స్టాలిన్‌బాబు, ఎంపీపీ ఇనుకొండ ధనలక్ష్మీ రవి కుమార్, నాయకులు ఇలపకుర్తి నరసింహారావు (పండు) రావూరి రామకృష్ణ, ఇనుకొండ చిన్న, రావూరి శ్రీనివాసు, గెల్లు గణపతి, ఇంటి గంగాధర్, రాయి కృష్ణ, కూన శ్రీను, దిగమర్తి ఆగస్టీన్, దేవరపు కృష్ణ, ఇనుకొండ బాలాజీ, ఇనుకొండ ఏడుకొండలు, ఇంటి సత్యనారాయణ, ఇంటి రమేష్, పాలపర్తి సందీప్ పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

తాడేపల్లిగూడెం   తణుకు
90102 23729
90100 68395
90100 51493
Office mail : tpgadvt@gmail.com